క్లుప్తంగా

వీధి వ్యాపారులకు అండగా 'బీఎంఎస్'


సమావేశంలో మాట్లాడుతున్న బీఎంఎస్ నాయకులు

మధురవాడ: వీధి వ్యాపారులకు బీఎంఎస్ అనుబంధంగా పనిచేస్తున్న విశాఖపట్నం షాప్ కీపర్స్ మజ్దూర్ సంఘం అండగా ఉంటుందని బీఎంఎస్ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఆర్.సురేష్, పోర్టు బీఎంఎస్ జనరల్ సెక్రటరీ బాదిరెడ్డి రవి శంకర్ చెప్పారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ ఆర్ఆర్ కన్వెన్షన్ సెంటర్ వద్ద నిర్వహించిన షాప్ కీపర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వలన వీధి వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారని, వారి ఉపాధి రక్షణకు అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా మధురవాడలో కొత్త యూనిట్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంవీ రమణమూర్తి, సీహెచ్ నాగరాజు, పి.శ్రీనివాస్, సత్యవతి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రఘు కళాశాలలో 'హాక్‌వర్స్ 1.0'



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఈవెంట్ ఆర్గనైజర్ శ్రీరామ్ విశాల్

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 24 గంటల హాక్‌వర్స్ 1.0 రాష్ట్రస్థాయి హాక్‌థాన్ ప్రారంభమైంది. ఈ సెల్ క్లబ్, గూగుల్ డెవలప్‌మెంట్ గ్రూప్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజర్ శ్రీరామ్ విశాల్ తెలిపారు. విద్యార్థులు కేవలం కోడింగ్‌కే పరిమితం కాకుండా టీంవర్క్‌తో సృజనాత్మకత, కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌తో కొత్త ఆవిష్కరణకు పునాది వేయవచ్చన్నారు. 13 కళాశాలల నుంచి 515 మంది విద్యార్థులు పాల్గొని 120 బృందాలుగా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయకుమార్, డీన్ సతీష్ చౌదరి, ఈ సెల్ ఆర్గనైజర్లు ఆముక్త వెంకటనాథ్, తనూష్, ఐఐసీ సెల్ ఇంచార్జ్‌లు కిరణ్, నరసింహరాజు, రఘు విద్యాసంస్థల వైస్ చైర్మన్ కలిదిండి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప పీఠంలో ధన త్రయోదశి పూజలు


గణపతి, అయ్యప్ప, సుబ్రహ్మణ్య స్వాములకు పుష్పార్చన

తగరపువలస: ధన త్రయోదశి, శని త్రయోదశి సందర్భంగా ఆనందపురం మండలం పొడుగుపాలెం గ్రామంలోని అయ్యప్పస్వామి పీఠంలో స్వాములు సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. ముగ్గురు అన్నదమ్ములైన వినాయకుడు, అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్య స్వాములకు గురుస్వామి శ్రీను ఆధ్వర్యంలో పూజలు చేశారు. స్వాములతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పాల్గొన్న భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

కార్తీకంలో నెయ్యి దీపాల బహుమానం ఉత్తమం


శ్రీరాధా మదన్ మోహనులకు నెయ్యి దీపాలతో హారతి ఇస్తున్న భక్తులు

తగరపువలస: కార్తీకమాసంలో శ్రీకృష్ణునికి నెయ్యి దీపాల బహుమానం ఉత్తమమైనదని యదురాజ దాస తెలిపారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న దామోదర దీపోత్సవంలో భాగంగా ఆయన శనివారం మాట్లాడారు. దామోదర మాసం ప్రాముఖ్యత, శనివారం నాడు వచ్చే ధనత్రయోదశి ఆవశ్యకతను వివరించారు. భక్తులు దామోదరునికి నెయ్యి దీపాలు అర్పించారు. అంబరీష దాస భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

వరికి తెగులు.. అన్నదాతకు దిగులు

● పొట్టదశలో వరిపంట ● ఎర్రగా మారిన పైరు ● రైతుల్లో ఆందోళన


పద్మనాభం గ్రామంలో సుడిదోమ సోకిన వరి పైరు


మద్దిలో పొటాష్ లోపించిన వరి పైరు

పద్మనాభం: మండల పరిధిలో వరిపంటను తెగుళ్లు ఆశించాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వేసిన వరి పంటపై తెగుళ్లు దాడి చేయడంతో అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు.

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వరి సాధారణ విస్తీర్ణం 6,930 ఎకరాలు కాగా, 6,813 ఎకరాల్లో వరి పంట వేశారు. మండలంలోని కృష్ణాపురం, మద్ది, తునిపాలెం, పద్మనాభం, బాందేవపురం, విలాస్కాన్‌పాలెం, విజయరాంపురం, అనంతవరం, పాత కొవ్వాడ, కొత్త కొవ్వాడ, పెంట, గంధవరం, కురపల్లి, కోరాడ, గెద్దపేట, బీఆర్ తాళ్లవలస, ఐనాడ, పొట్నూరు, తునివలస గ్రామాల్లో ఈ పంట వేశారు. ఈ గ్రామాల్లో వరి పంట పొట్ట దశలో ఉంది. మరో రెండు నెలల్లో పంట చేతికి రావాల్సి ఉంది. పొట్ట దశలో ఉన్న సమయంలో తెగుళ్లు దాడి చేయడంతో పైరు నాశనం అవుతోంది. ఎకరం విస్తీర్ణంలో వరి పంటకు అన్నదాతలు ఇంతవరకు 20 వేల వరకు పెట్టుబడి పెట్టారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వేసిన పంట తెగుళ్ల బారిన పడడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్లు సోకడం వల్ల పైరు ఎదుగుదల లోపించి దిగుబడి తగ్గే ప్రమాదం ఉండడంతో అన్నదాతలు కలత చెందుతున్నారు. దోమ పోటు, పొడ తెగులు, ఆకుముడత తెగుళ్లు సోకాయి. పొటాష్ లోపించింది.

తెగుళ్ల లక్షణాలు


మద్దిలో తెగుళ్లు సోకిన వరిపైరును చూపిస్తున్న రైతులు

- దోమపోటు వల్ల పొలంలో చేను సుడులుసుడులుగా ఎండిపోతుంది.
- కాండం మధ్యలో దోమలు కన్పిస్తాయి.
- పొడ తెగులు వల్ల ఆకులపై పొడ పాము మచ్చలు కనిపిస్తాయి.
- ఆకు ముడత వల్ల ఆకు మధ్యలో పచ్చ పురుగు కనిపిస్తుంది. ఆకులోని పచ్చని పదార్థాన్ని తినడం వల్ల రేకు తెల్లగా కన్పిస్తుంది.
- పొటాషియం లోపం వల్ల ఆకులు ఎరుపు రంగులోకి మారి కొనలు ఎండిపోతాయి.

నివారణ చర్యలు

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం తెలిపారు. పంటను కాపాడుకునేందుకు పలు సూచనలు చేశారు.

- దోమ పోటుకు 'పై మెట్రోజోన్ 120 గ్రాములను లీటరు నీటికి కలిపి.. రెండు వందల లీటర్ల ద్రావణాన్ని ఎకరం విస్తీర్ణంలో వరి పైరుకు పిచికారి చేయాలి.
- పొడ తెగులు నివారణకు హెక్సా కొనజోల్ రెండు మిల్లీ లీటర్లు లేదా వేలడా మైసిన్ లీటరు నీటికి కలిపి, రెండు వందల లీటర్ల ద్రావణాన్ని ఎకరాకు పిచికారి చేయాలి.
- ఆకు ముడత నివారణకు క్లోరిఫైరిఫాస్ రెండు మిల్లీ లీటర్ల చొప్పున లీటరు నీటికి కలిపి, రెండు వందల లీటర్ల ద్రావణాన్ని ఎకరాకు పిచికారి చేయాలి.
- పొటాష్ లోపం నివారణకు 13.0.45 మందు రెండు కిలోలను రెండు వందల లీటర్ల నీటికి కలిపి, ఎకరాకు పిచికారి చేయాలి


మద్దిలో తెగుళ్లు సోకిన వరి పైరును పరిశీలిస్తున్న ఏవో ఎంవీఎస్‌చలం

నాలుగు సార్లు మందులు పిచికారి చేశాను



నేను రెండెకరాల విస్తీర్ణంలో వరి పంట వేశాను. ఇంత వరకు రూ.40వేలు పెట్టుబడి పెట్టాను. పైరులో తెగుళ్ల నివారణ కోసం సుమారు రూ.8వేలు పెట్టి మందులు కొట్టాను. ఈ ఏడాది ఎప్పుడూ లేనివిధంగా వరి పంటకు తెగుళ్లు ఎక్కువగా సోకాయి. పొట్ట దశలో ఉన్న సమయంలో తెగుళ్లు సోకడంతో దిగుబడి ఎలా ఉంటుందా అని భయంగా ఉంది.

– కె.పద్మనాభం, కృష్ణాపురం

ఎదుగుదల లోపించింది



నేను అర ఎకరం విస్తీర్ణంలో వరి పైరు వేశాను. తెగుళ్లు సోకడంతో ఎదుగుదల లోపించింది. దీనివల్ల దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. గతేడాది 12 బస్తాల దిగుబడి వచ్చింది. ఇప్పుడు తెగుళ్ల వల్ల దిగుబడి తగ్గిపోతుందేమో. ఇంతవరకు నాలుగు సార్లు మందులు పిచికారి చేశాను.

– ఎస్.వలసయ్య, కృష్ణాపురం


మద్దిలో వరి పైరుకు మందులు పిచికారి చేస్తున్న రైతు

అందరి సహకారంతో కాలుష్య రహిత విశాఖ


స్వచ్ఛ దీపావళి పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి తదితరులు

భీమునిపట్నం/కొమ్మాది: విశాఖను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి రమణమూర్తి కోరారు. భీమిలి బీచ్ పార్కులో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు క్లీన్ ఎయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో స్వచ్ఛమైన గాలి, మంచి వాతావరణ అభివృద్ధికి మొక్కలు నాటి, చెట్లు పెంచేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరం అన్నారు. 'స్వచ్ఛ దీపావళి-శుభ దీపావళి' ను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ గుడ్డ సంచులను అందరికీ ఉచితంగా అందజేశారు. అనంతరం భీమిలి నర్సింహ స్వామి దేవాలయం కొండపై పచ్చదనాన్ని పెంపొందించేందుకు పలు అడవి జాతి విత్తనాలను, సీడ్ బాల్స్‌ను చల్లారు. కార్యక్రమంలో భీమిలి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, ప్రధాన వైద్యాధికారి డా. ఈఎన్‌వీ నరేష్‌కుమార్ స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటుదాం


పద్మనాభంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు, అధికారులు

తగరపువలస: కాలుష్యాన్ని నివారించడానికి గాను ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర, స్వచ్ఛ వాయువు కార్యక్రమంలో భాగంగా కళాశాలలో విద్యార్థులకు శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత గురించి తెలియజేశారు. ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిలిపివేసి సెల్‌ఫోన్‌ల వాడకాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని సూచించారు. గ్రీన్ దీపావళి కార్యక్రమంలో భాగంగా శబ్ద రహిత, కాలుష్య రహిత దీపావళి జరుపుకోవాలని కోరారు. సేంద్రియ రంగులతో రంగవల్లులు తీర్చిదిద్ది, దీపావళి జరుపుకొన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి సాయిదీప్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పద్మనాభంలో ర్యాలీ

పద్మనాభం: వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నినదిస్తూ కృష్ణాపురం కస్తూర్బా విద్యార్థినులు, అధికారులు శనివారం పద్మనాభంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి, మండల పరిషత్ ఏవో జయ ఉమ, ఎంఈవోలు పి.రమణ, బాబూలాల్, డిప్యూటీ ఎంపీడీవో బీవీ రమణ, డీటీ శ్రీనివాసరావు, ఏఈలు పద్మజ, జగన్మోహనరావు, హరీష్ పాల్గొన్నారు.

'సేవ్ ద గర్ల్ చైల్డ్' పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ


కలెక్టర్ హరేంధిర ప్రసాద్ నుంచి బహుమతులు అందుకుంటున్న లక్ష్మీపురం విద్యార్థులు



విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎస్ఎస్ఏ ఏపీసీ చంద్రశేఖరరావు


తగరపువలస: ఇటీవల అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులకు శనివారం బహుమతుల ప్రదానం జరిగింది. లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినుల్లో 10వ తరగతికి చెందిన ఎస్.చిన్ని వ్యాసరచనలో జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలవగా, వక్తృత్వ పోటీలకు సంబంధించి 9వ తరగతి విద్యార్థినులు కె.అక్షయ ప్రథమస్థానంలో, కె.యామిని రెండో స్థానంలో నిలిచారు. అంబేడ్కర్ హైస్కూల్‌కు చెందిన కొప్పల తేజేశ్వరి వ్యాసరచన పోటీలలో బహుమతి సాధించింది. తోటగరువు హైస్కూల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతులమీదుగా వారు బహుమతులు స్వీకరించారు. పోటీలకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, రెడ్డిపల్లి అప్పలరాజులను భీమిలి ఎంఈవో శివరాణి, హెచ్ఎం అభినందించారు.

కేజీబీవీ విద్యార్థినులకు..

పద్మనాభం: సేవ్ ద గర్ల్ చైల్డ్ మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన కృష్ణాపురం కస్తూర్బా విద్యాలయం విద్యార్థినులకు సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ఏపీసీ జె.చంద్రశేఖరరావు తోటగరువు హైస్కూల్లో శనివారం బహుమతులు అందజేశారు. వ్యాస రచనలో నిహారిక, చిత్ర లేఖనంలో యోగిత, వక్తృత్వంలో హారిక మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడంతో, వీరికి ఏపీసీ బహుమతులు అందజేశారు.

ముగిసిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు


కబడ్డీలో తలపడుతున్న బాలికలు


వాలీబాల్ ఆడుతున్న బాలుర జట్లు


ఖోఖో ఆడుతున్న బాలికలు

తగరపువలస: చిట్టివలస, ఆనందపురం జెడ్పీ హైస్కూళ్లలో రెండు రోజుల పాటు జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు శనివారం ముగిశాయి. అండర్-14, అండర్-17 విభాగాలలో బాలురు, బాలికలకు రన్నింగ్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, త్రోబాల్ తదితర పోటీలు నిర్వహించారు. దాతలు, నాయకులు క్రీడల ఏర్పాటుకు సహాయసహకారాలు అందించారు. మండల స్థాయిలో గెలుపొందిన బాలబాలికలకు ఈ నెల 21 నుంచి 24 వరకు డివిజన్ స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలను ప్రధానోపాధ్యాయులు డి.ఆదినారాయణ, కామేశ్వరరావుల ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులు అచ్యుతరావు, నరసింహమూర్తి, ప్రసాద్, బుజ్జి నిర్వహించారు.

విద్య, వైద్యం ప్రభుత్వమే అందించాలి

- వైఎస్సార్‌సీపీ నాయకుల డిమాండ్
- వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ


ఏడో వార్డులో కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు తదితరులు


మూడో వార్డులో సంతకాల సేకరణ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


అనిట్స్ రహదారిలో సంతకాల సేకరణ చేస్తున్న నాయకులు


ఇడదాసరిపేటలో సంతకాలు సేకరిస్తున్న నాయకులు


మద్దిలో కోటి సంతకాల సేకరణ చేపడుతున్న ఎంపీపీ రాంబాబు

మధురవాడ: ప్రజలకు మౌలిక సదుపాయాలైన విద్య, వైద్యం వంటివి ప్రభుత్వమే అందించాలని వైఎస్సార్‌సీపీ ఏపీ నగరాలు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రజాశ్రేయస్సు కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో ప్రైవేటుకు ధారాదత్తం చేయడం సరికాదన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న సంతకాల సేకరణను ఏడో వార్డులో ఉద్యమంలో చేపట్టాలని కోరారు. ఈ మేరకు పిలకవానిపాలెంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. వైద్యకళాశాలల ప్రైవేటీకరణ వల్ల వచ్చే ఇబ్బందుల గురించి ప్రజలకు అవగాహన కల్పించి, సంతకాలు సేకరించాలని కోరారు. కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు వంకాయల మారుతీప్రసాద్, మధురవాడ మాజీ సర్పంచ్ కుడిటి రామారావు, వివిధ విభాగాల నాయకులు చేకూరి రజని, పెంద్ర అప్పన్న, మగ్గూరి వెంకటరమణ, పోతిన శేషుబాబు, తమ్మినేని వరలక్ష్మి, యల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ప్రాథమిక హక్కు

భీమునిపట్నం: ప్రభుత్వం ప్రజలకు వైద్యం, విద్యను అందించాలని, వీటిని పొందే ప్రాథమిక హక్కు ప్రజలకు ఉందని భీమిలి మూడో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా శనివారం పోస్టర్లు ఆవిష్కరించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు మెడిసిన్ చదివే అవకాశం లేకుండా చేసి, వారికి పూర్తిగా అన్యాయం చేయనున్నారన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాల్సి ఉందన్నారు. ఈ విషయంలో అందరం కలసికట్టుగా పోరాడాలన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న కోటి సంతకాల సేకరణకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం కార్యదర్శి ఆర్.ప్రభాకర్‌నాయుడు, నాయకులు మైలపల్లి లక్ష్మణరావు, వాసుపల్లి కొండబాబు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, బోని సంజీవరావు, కోండ్రు రామసూరప్పడు, బూర నాగరాజు, చెల్లూరి గౌరినాయుడు, అనపర్తి సూర్యప్రకాశ్, బాకి రమణారెడ్డి, కొంకుపూడి ఎర్రిబాబు, పీతల శంకరరావు, పాసి వినోద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ యువజన విభాగ కార్యదర్శిగా నియమితులైన రాంభుక్త ప్రభాకర్‌నాయుడును నాయకులు అభినందించారు.

రెండో వార్డులో..

తగరపువలస: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంగివలస అనిట్స్ కళాశాల, ఎన్ఆర్ఐ ఆస్పత్రి వద్ద వైఎస్సార్‌సీపీ రెండోవార్డు ఇన్‌చార్జ్ శిల్లా కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో బూత్‌కమిటీల అధ్యక్షుడు శిల్లా వంశీరెడ్డి, నాయకులు చిల్ల సూర్యనారాయణరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, సరగడ నాగిరెడ్డి, జీరు పద్మ, చేట్ల అప్పలసూరమ్మ, సరగడ బుజ్జిరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, చేట్ల శ్రీనివాసరెడ్డి, తోణంగి ఎల్లాజీ, పీతల రాజారావు, ఊడికల శ్రీరామమూర్తి, కిల్లాడ భరద్వాజరెడ్డి, కొల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

- ఇడదాసరిపేటలో చేపట్టిన సంతకాల సేకరణలో 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి, అక్కరమాని మంగరాజు, జీరు వెంకటరెడ్డి, చిప్పాడ వెంకటేష్, నమ్మి ఆదప్పడు, బోర అప్పలరాజు, రీసు గౌరి తదితరులు పాల్గొన్నారు.

మద్దిలో..

పద్మనాభం: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పద్మనాభం మండలంలో కోటి సంతకాల సేకరణకు వైఎస్సార్‌సీపీ శనివారం శ్రీకారం చుట్టింది. మండలంలోని మద్దిలో ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ కంటుబోతు రాంబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 22 పంచాయతీల పరిధిలో ఆరు వేలకు మించి సంతకాలు సేకరిస్తామన్నారు. ఇంటింటికీ వెళ్లి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ముద్రించిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్లు, కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ అధ్యర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుగత అప్పలనాయుడు, కనకల అప్పలరాజు, కంటుబోతు పైడిరాజు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా గరుడసేవ


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణమండపంలో గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. శేషవస్త్రాలు అందజేశారు.

తర్లువాడలో దళితుల భూములు రక్షించాలని వినతి


ఎంపీ రాధాకృష్ణన్‌ను కలిసిన తర్లువాడ దళిత రైతులు

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడలో తమ జీవనాధారం కోసం 1972లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన భూములు రక్షించాలని కోరుతూ దళితులు శనివారం డీఎస్ఎంఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.రాధాకృష్ణన్‌కు వినతిపత్రం అందించారు. నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో వెళ్లి ఆయన్ను కలిసి, తమ సమస్యలు తెలియజేశారు. తమ భూములను ల్యాండ్ పూలింగ్ పేరుతో ప్రభుత్వాలు పదేళ్లుగా అడుగుతున్నా ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెవెన్యూ అధికారులను అడ్డం పెట్టుకుని రీసర్వే, ఎల్‌పీ నంబర్లు ఇస్తామని బూటకపు మాటలతో వంచించారన్నారు. ఇటీవల కలెక్టర్ కూడా పరిహారం తీసుకుని భూము లు గూగుల్‌టెక్‌కు ఇవ్వాలని సూచించడంతో నిశ్చేష్టులయ్యామన్నారు.పార్లమెంట్‌లో తమ సమస్యలను ప్రస్తావించి భూములు రక్షించాలని కోరారు. రాధాకృష్ణన్‌ను కలిసిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, మూర్తి, అప్పలనాయుడు ఉన్నారు.

ల్యాబ్ పరీక్షలకు అనుమతించారు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి ఎస్ఎస్ఆర్ఐటీ కళాశాల యాజమాన్యం శనివారం జరిగిన ల్యాబ్ పరీక్షలకు విద్యార్థులందరినీ అనుమతించారు. ట్యూషన్ ఫీజు చెల్లించని విద్యార్థులను శుక్రవారం నాడు జరిగిన ల్యాబ్ పరీక్షలకు అనుమతించకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై 'ఫీజు చెల్లించలేదని ల్యాబ్ పరీక్షలకు అనుమతించలేదు' శీర్షికతో శనివారం సాక్షిలో వార్తను ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై కళాశాల యాజమాన్యం స్పందించి, అనుమతించారని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులు బోధన మెరుగు పరచుకోవాలి

తగరపువలస: ఉపాధ్యాయులు బోధన మెరుగుపరచుకోవాలని భీమిలి ఎంఈవో జి.శివరాణి సూచించారు. విద్యార్థుల పరీక్ష పేపర్లు దిద్ది ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ కార్యక్రమంలో ఆమె ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. అనుమతి లేకుండా ఉపాధ్యాయులెవరూ సెలవులు పెట్టవద్దని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీపురం, మజ్జిపేట, మజ్జివలస పంచాయతీల పరిధిలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీ సూర్యనారాయణ పాల్గొన్నారు.